క్లుప్తంగా

పోటీ పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థులకు నిర్వహించే ఇంగ్లిష్ పోటీ పరీక్షల పోస్టర్‌ను డీఈఓ రామారావు ఆదివారం విడుదల చేశారు. డీఈఓ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇంగ్లిష్ సబ్జెక్టులో విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎల్టా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ అసోసియేట్ అధ్యక్షుడు సైదుల్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు శ్యామలాదేవి, కన్వీనర్లు శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

స్వచ్ఛ దేవాలయ సేవ



మహబూబాబాద్ రూరల్: అయోధ్యలో రాములోరి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని తాండవ కృష్ణ నృత్యాలయ అకాడమీ చిన్నారుల ఆధ్వర్యంలో స్వచ్ఛ దేవాలయ సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అలాగే దళిత హిందూ పరిషత్ ఆధ్వర్యంలో దీర్ఘసుమంగళీభవ పేరిట ఇంటింటా పసుపు, కుంకుమ, పూలు, గాజులు, పూజిత అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో దళిత హిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి సుగుణ, జిల్లా అధ్యక్షురాలు ఇరుకుల్ల లక్ష్మి, బానోత్ శంకర్ మేస్త్రి, సిరిపురం వీరన్న పాల్గొన్నారు.

సేవారత్న అవార్డు ప్రదానం



నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్‌గా పనిచేస్తున్న బానోత్ రమేష్‌కు సేవారత్న అవార్డు దక్కింది. పుడమి సాహితి వేదిక సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమి చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు రమేష్ ఆదివారం తెలిపాడు.

సోలార్ ఫెన్సింగ్ ప్రారంభం



గార్ల: అమెరికాలో స్థిరపడిన ఎన్నారై డాక్టర్ పులి గోపాల్‌రెడ్డి ప్రమీలారెడ్డి దంపతుల చిన్న కోడలు జర్మనీకి చెందిన దాత తాన్యారెడ్డి మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి దేవాలయం చుట్టూర సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు కోసం రూ.1,05,000 విరాళం అందజేశారు. ఇట్టి నగదుతో దేవాలయం చుట్టూర ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్‌ను తాన్యారెడ్డి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

రామాయణ పారాయణం



మహబూబాబాద్ రూరల్: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని హరికిషన్ ఝువర్, మాంగీభాయి ఝువర్ నివాసంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న రామాయణ పారాయణం ఆదివారం ముగిసింది. ఇందులో భాగంగా చిన్నారులకు రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు, లవకుశలు అలంకరణలో తీర్చిదిద్ది వారికి పూజలు, అభిషేకాలు జరిపారు.

వేం నరేందర్ రెడ్డికి అభినందనలు

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల సలహాదారులుగా నియామకమైన జిల్లా వాసి వేం నరేందర్ రెడ్డిని ఆదివారం మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య హైదరాబాదులోని వేం నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపాడు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్, నాయకులు సంజీవ రెడ్డి, యాదవరెడ్డి, ప్రభాకర్ గౌడ్, వెంకటేశ్వర్లు, సీతారాం రెడ్డి, సంజీవరెడ్డి, అంజయ్య, యాదవరెడ్డి, శరత్ పాల్గొన్నారు.

శోభాయాత్ర

మహబూబాబాద్ రూరల్: అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో శ్రీరామ భక్తజనం ఆదివారం భారీ శోభాయాత్ర నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా విభాగపు జిల్లా అధ్యక్షురాలు ఇందుభారతి మాట్లాడారు.

బడుల్లో ఎన్నికల సందడి

- ఈనెల 29న ఎస్ఎంసీ ఎలక్షన్స్
- నూతన కమిటీలతో పాఠశాలల్లో పెరగనున్న పర్యవేక్షణ

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల సందడి మొదలైంది. పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలకు విద్యాశాఖ శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో ఈనెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు చేపట్టనున్నారు. 2019 డిసెంబర్‌లో విద్య కమిటీలను ఎన్నుకోగా పలు కారణాలతో ఇంతకాలం పదవీ కాలం పొడగిస్తూ వచ్చారు. పాత కమిటీల్లో ఆ పాఠశాలల్లో చదవని విద్యార్థుల తల్లిదండ్రులు నేటికి చైర్మన్‌లుగా కొనసాగుతున్నారు. వీరు పట్టించుకోకపోవడంతో విద్యా వ్యవస్థ కొంత అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఎంసీ చైర్మన్‌లుగా ఉన్నట్లయితే పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.

మండలంలో ప్రాథమిక పాఠశాలలు 18 ఉండగా ప్రాథమికోన్నత పాఠశాలలు 05, ఉన్నత పాఠశాలలు 05 ఉన్నాయి. వీటితో పాటు కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ఆయా పాఠశాలల్లో 2,194 విద్యార్థులు చదువుకుంటున్నారు. 2019లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించగా కోవిడ్ ప్రభావంతో నేటి వరకు ఎన్నికలు నిర్వహించలేదు. నూతన సర్కార్ దృష్టి సారించడంతో ఎన్నికల నిర్వహణ ముందడుగు పడింది.



పెద్దవంగర పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

షెడ్యూల్ ఇలా..

గత శనివారం (ఈ నెల 20) ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికకు ప్రకటన జారీ చేశారు. ప్రాథమిక, ప్రాథమిక కోన్నత, ఉన్నత పాఠశాల నోటీస్ బోర్డులపై తల్లిదండ్రుల జాబితా ప్రదర్శన చేశారు. 22, 22న తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ, సమస్యలు పరిష్కారం కోసం చొరవచూపడం, 24న ఎన్నిక కోసం తల్లిదండ్రులు పోటీలో ఉండే సభ్యుల తుది జాబితాను ఖారారు చేసి పాఠశాల బోర్డుపై నోటీసు ప్రదర్శన. 29న ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల అనంతరం అదే రోజు మొదటి సమావేశం నిర్వహించాలి. ఈ ప్రక్రియలన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు చేపట్టాలి.

ఎస్ఎంసీల బాధ్యతలివే..

పాఠశాలల్లో హాజరుశాతం పెంపునకు చొరవ చూపడం, మధ్యాహ్నం భోజనం అమలు, పుస్తకాలు, యూనిఫాం పంపిణీలో పర్యవేక్షణ, ఎస్ఎంసీలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకంగా ఉంటుంది. ఇందులో ఎన్నికైన సభ్యులు పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు. మన ఊరు–మన బడి పనుల పరిశీలనతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి. పాఠశాలకు నిధులు మంజూరు అయితే తీర్మానాలు చేయడం, ఉపాధ్యాయుల విధులు, సమయపాలనపై ఈ కమిటీ పర్యవేక్షించాలి.

నిబంధనల ప్రకారమే ఎన్నికలు



మండలంలో అన్నిప్రభుత్వ పాఠశాలల్లో ఆయా పాఠశాలలోని హెచ్ఎంలు ఈనెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను నిబంధనల ప్రకారం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల నిర్వహన విద్యాశాఖ ఆదేశాల మేరకు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఎన్నిక ప్రక్రియ చేపడతాం. 1నుంచి 8వ తరగతులకు ఎన్నికలు నిర్వహిస్తాం. 9, 10 తరగతుల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ కమిటీలో అవకాశం లేదు.

– శ్రీనివాస్, నోడల్ హెచ్ఎం, పెద్దవంగర

లెనిన్ పోరాటం స్ఫూర్తిదాయకం



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న చంద్రన్న

నెహ్రూసెంటర్: ప్రపంచంలో మానవాళి ఎదుర్కొంటున్న దోపిడీపై లెనిన్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాయం చంద్రన్న, రాష్ట్ర నాయకులు నాయని రాజు అన్నారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం లెనిన్ వర్ధంతిని నిర్వహించారు. సమావేశంలో కొత్తపల్లి రవి, జగ్గన్న, సత్యం, రాజేశ్వర్‌రెడ్డి, సూరి, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, పాపయ్య పాల్గొన్నారు.

బయ్యారం: బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో న్యూడెమోక్రసీ నాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, నాయకులు మురళీకృష్ణ, నాగేశ్వరరావు, వీరభద్రం, భూషణ్‌రావు పాల్గొన్నారు.

కురవి: మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ చరిత్రనే మార్చిన నవ సమాజ నిర్మాత లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, మండల కార్యదర్శి కర్ణం రాజన్న, నాయకులు వెంకన్న, సారయ్య, సత్యం పాల్గొన్నారు.

తొర్రూరు: లెనిన్ ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలోని బస్‌స్టాండ్ సెంటర్‌లో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఓమా భిక్షపతి, నాయకులు గణపురం లక్ష్మణ్, బంధు మహేందర్, మంగళంపల్లి మల్లయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

త్రివిక్రమ్‌పై కేసు నమోదు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: గుంటూరు కారం సినిమాలో విలన్లకు మహనీయులైన మార్క్స్, లెనిన్‌ల పేర్లను తొలగించి, దర్శకుడు త్రివిక్రమ్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల జిల్లా కార్యదర్శులు కేలోత్ సాయి కుమార్, భువనగిరి మధు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం త్రివిక్రమ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు గుగులోత్ సూర్య ప్రకాష్, బానోత్ సింహాద్రి, నాయకులు భూక్యా రాజేష్, ఉపేందర్ భాస్కర్, విజయ్, దిలీప్ చింటు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సంఘం బాధ్యులు

ఆదివాసీలకే కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

నెహ్రూసెంటర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంగా ఏర్పడిన నాటి నుంచి ప్రధాన పార్టీలు లంబాడీలకే కేటాయిస్తున్నారని అన్నారు. పార్లమెంట్ పరిధిలోని పినపాక, భద్రాచలం, ములుగు, ఇల్లెందు నియోజకవర్గాల్లో అత్యధికంగా ఆదివాసులే మెజార్టీగా ఉన్నారని కానీ లంబాడీ సామాజికవర్గానికి చెందిన వారికే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. ఆదివాసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తూ ఓట్లు దండుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు, కన్వీనర్ ఈసం సుధాకర్, పడిగె నాగేశ్వర్‌రావు, వాగబోయిన చంద్రయ్య, కల్తీ సత్యనారాయణ, అలెం కోటి, దుబ్బకట్ల సుమన్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కోసం కృషి చేయాలి

కురవి: త్వరలో జరగబోయే విద్యాకమిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వారి గెలుపు కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కురవి టౌన్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్ తెలిపాడు. ఆదివారం కురవిలో విద్యా కమిటీ ఎన్నికలపై పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు ఎర్ర నాగేశ్వర్‌రావు, దామోదర్‌రెడ్డి, హైస్కూల్ కమిటీ చైర్మన్ మిర్యాల లక్ష్మయ్య, కామిండ్ల వీరన్న, చిన్నం గణేష్, నాయకులు విశ్వనాథం, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జైన ఆలయంలో పూజలు

డోర్నకల్: డోర్నకల్‌లో నూతనంగా నిర్మించిన జైన ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం యాగశాలలో యాగ మండల్ పూజ, హోమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థి మృతి

మరిపెడ రూరల్: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని దారావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దారావత్‌తండాకు చెందిన దారావత్ వీరు, సరోజ దంపతుల కుమారుడు దారావత్ ఉదయ్‌కుమార్ (19) జిల్లాలోని పాకాల కొత్తగూడెం మండల కేంద్రంలోని గురుకులంలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఉదయ్‌కుమార్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించి ఉదయ్‌కుమార్ మృతి చెందాడు.

బాలికకు గాయం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో గల చిల్డ్రన్స్ పార్కులో ఆదివారం ఓ బాలిక ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. సీరోలు మండలం కాంపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుమ్మరి సోమేశ్ కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఓ ఫంక్షన్ ఉండగా వెళ్లారు. సాయంత్రం సోమేశ్ కుమార్తె రిషిక ఆడుకునేందుకుగాను స్థానిక చిల్డ్రన్స్ పార్కుకు వెళ్లింది. అక్కడ ఆడుకుంటుండగా రిషిక వేలుకు తీవ్ర గాయమైంది. వెంటనే చికిత్స నిమితం ఆ బాలికను ఆస్పత్రికి తరలించగా బొటనవేలు గోరు భాగంను తొలగించారు. శిథిలావస్థకు చేరిన ఆటవస్తువుతో చిన్నారి చేతి బొటనవేలు విరిగి ఊడిపోయిందని స్థానికులు పేర్కొన్నారు.

23నుంచి సీపీఐ ఆందోళనలు

నెహ్రూసెంటర్: బీఆర్ఎస్ నిధులు విడుదల చేయని జీఓలపై ఈనెల 23, 24, 25 తేదీల్లో మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నామని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.2కోట్ల నిధులకు సంబంధించిన జీఓలు విడుదల చేసిన నేటికి నిధులు విడుదల కాలేదని గుర్తుచేశారు. సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, మాలోత్ రవీందర్, పురం భాగ్య, నక్క నాగార్జున, తండ శ్రీనాథ్, తోట రమేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గిన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



ఉగ్గంపల్లిలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి, పగిడిపల్లి, ఉగ్గంపల్లి గ్రామాల్లో ఆదివారం అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. ఉగ్గంపల్లిలోని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భర్తాపురం ఉదయమ్మ కొమిరెల్లి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బాల్యతండా, దంట్లకుంటతండా గ్రామాల్లో శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జర్పుల కాలునాయక్, భూక్య వెంకన్న, బానోతు హరినాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలం దాట్ల, కుమ్మరికుంట్ల గ్రామాలలో రాముల వారి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మినేని రవీందర్, ఎంపీటీసీ సభ్యులు కొమ్మినేని సతీష్, సంపెట రాము పాల్గొన్నారు.

సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

గార్ల: యువజన కాంగ్రెస్ మండల నాయకుడు భూక్యా రామ్‌కుమార్ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోరం సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

కల్లు గీత సంఘం క్యాలెండర్..

పెద్దవంగర: కల్లు గీత కార్మిక సంఘం క్యాలెండర్లను ఆదివారం ఎస్సై పిల్లల రాజు చేతుల మీదుగా సంఘం మండల అధ్యక్షుడు అనపురం రవి గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యాకయ్య, అయోధ్య, హరీశ్, సతీష్, వెంకన్న, కమలాకర్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

జీఎంపీఎస్ క్యాలెండర్..

దంతాలపల్లి: గొల్లకురుమల హక్కులకోసం ఐక్యంగా ఉద్యమించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రమేష్‌బాబుతో కలిసి సంఘం క్యాలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఊడుగుల ఐలయ్య, నాయకులు యాకయ్య, రామకృష్ణ మురళీ, సురేష్ పాల్గొన్నారు.



గార్ల: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

వ్యాసరచన పోటీల్లో పాల్గొనాలి

మహబూబాబాద్ అర్బన్: 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉన్నత పాఠశాల, కేజీబీవీ మోడల్ స్కూల్ విద్యార్థులు వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో పాల్గొనాలని డీఈఓ రామారావు తెలిపారు. నేను తప్పకుండా ఓటు వేస్తాను, ప్రజాస్వామ్య పరిరక్షణలో యువకుల పాత్ర అనే అంశం ఉంటుందన్నారు. జూనియర్ విభాగంలో ఏడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి, సీనియర్ విభాగంలో పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొనాలన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గ స్థాయిలో ఈనెల 23న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, డోర్నకల్ నియోజకవర్గం స్థాయిలో ఈనెల 23న, సీతారాంపురం పాఠశాలలో, జిల్లాస్థాయిలో 24న ప్రభుత్వ ఉన్నత పాఠశాల మహబూబాబాద్‌లో నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఆయా మండలాల ఇన్‌చార్జ్‌లను సంప్రదించాలన్నారు. వివరాలకు ఏసీజీఈ మండుల శ్రీరాములను సంప్రదించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

యువత స్వశక్తితో ఎదగాలి

నర్సింహులపేట: యువత స్వశక్తితో ఎదగాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. యువత అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు జినుకల రమేష్, కడుదుల రామకృష్ణ, సామిరెడ్డి, రజినికాంత్‌రెడ్డి, వెన్నం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పదో వార్డు పరిధిలోని బోడతండా, పాత తండాలో శ్రీఆంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కమిటీ చైర్మన్‌గా బోడ భీంసింగ్ నాయక్, వైస్ చైర్మన్‌గా ఇస్లావత్ సీతారాం నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ శ్రీను నాయక్, కోశాధికారిగా ధరావత్ రమేష్ నాయక్‌ను ఎన్నుకున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

డోర్నకల్: స్థానిక సుభాష్‌వీధిలో సుక్కా శ్రీనివాస్ శనివారం రాత్రి తన టీవీఎస్ స్పోర్ట్స్ ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు నిలపగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. తన ద్విచక్ర వాహనం చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు శ్రీనివాస్ తెలిపాడు.

గోశాల ఏర్పాటు అభినందనీయం

నెల్లికుదురు: మండల కేంద్రంలో గోశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి అన్నారు. మండల కేంద్రంలో కన్యకా పరమేశ్వరి గోశాల సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గోశాలను సర్పంచ్ యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వెన్నాకుల వాణి శ్రీను, వేముల బాబ్జి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవ రెడ్డితో కలిసి ఎంపీపీ ప్రారంభించారు.

ఆర్థికసాయం

నెల్లికుదురు: రహదారి నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన పులి రామచంద్రు ఆదివారం రూ.20వేల ఆర్థికసాయం అందించాడు. కార్యక్రమంలో రైతులు శ్రీనువాస్, యాకయ్య, వీరయ్య, నాగరాజు, వెంకన్న, మల్లయ్య, రామచంద్రు, సారమ్మ పాల్గొన్నారు.

కాల్వపై నిర్మాణం చేపడితే చర్యలు

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు ఆయకట్టు పరిధిలో బయ్యారం ఊరి పక్కన ఉన్న గుండ్లోరి కాల్వ పక్కన ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని ఇరిగేషన్ జేఈ శ్రీకాంత్ ఆదివారం తెలిపాడు. నిర్మాణాలు జరిపితే చట్టపరంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామన్నారు.

గుండెపోటుతో మృతి

మరిపెడ: గుండెపోటుతో కూరగాయల వ్యాపారి మృతి చెందిన సంఘటన మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన రమణబోయిన రామస్వామి (60) సంతలో కూరగాయలు విక్రయించి రోడ్డుపై గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడున్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్: నేడు రాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని 'హజారత్ నాగుల్ మీరా మౌలాచాన్' దర్గాలో తలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాలకు మండలం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని గణేష్ ఉత్సవ కమిటీ బాధ్యుడు రేసు సత్తిరెడ్డి పిలుపునిచ్చారు.

నేడు ప్రత్యేక పూజలు

గంగారం: గంగారం మండలంలోని కోమట్లగూడెం గ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో అయోధ్య శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ శుభ సందర్భంగా రాముని కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఆలయ కమిటీ అధ్యక్షుడు సైప సురేష్ ఆదివారం తెలిపాడు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ధనసరి సీతక్క కుమారుడు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యూత్ జనరల్ సెక్రటరీ ధనసరి సూర్య, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాదం ప్రవీణ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపాడు.

అన్నదానం

కేసముద్రం: కేసముద్రం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న హంగర్ రిలీఫ్ 21వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో దాత కొల్లూరు శంకరయ్య నేతృత్వంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, శ్రీహరి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గార్ల: స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పుల్లూరు పంచాయతీలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ స్వాతిబిందు పరిశీలించారు ఆదివారంతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ముగిసిందన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నిక

గూడూరు: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం మండల ఆర్యవైశ్యుల సమావేశం జిల్లా అధ్యక్షుడు నాళ్ల నర్సింహారావు గుప్త, బొల్లం సాంబమూర్తి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉమామహేశ్వర్‌గుప్త, కార్యదర్శిగా జూలూరు శ్రీనివాస్‌గుప్తలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మండల అధ్యక్షుడిగా గంగాధర్



పెద్దవంగర: తెలంగాణ యాదవ మహాసభ సమావేశంలో ఆదివారం సంఘం మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజు సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రెడ్డబోయిన గంగాధర్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కూకట్ల వీరన్న, కేషబోయిన శుభాష్, ప్రధాన కార్యదర్శిగా జిట్టె రమేష్, సహాయ కార్యదర్శిగా వల్లాల భిక్షపతి నియమితులైయ్యారు.

గోల్డెన్ జూబ్లీ సన్నాహక సమావేశం

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు జెడ్పీఎస్ఎస్ పాఠశాల 50వసంతాలు పూర్తి చేసుకుంది. ఈమేరకు ఆదివారం సెలబ్రెషన్ కమిటీ సభ్యుడు బియ్యాల దేవేందర్‌రావు అధ్యక్షతన పాఠశాల గోల్డెన్ జూబ్లీ సెలబ్రెషన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి తిరుమాలా చార్యులు, సర్పంచ్ నవీన్‌రావు, ఎంపీటీసీ శోభ పాపారావు, సభ్యులు పాల్గొన్నారు.

రెడ్డిసేవా సంఘం అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

కేసముద్రం: రెడ్డి సేవా సంఘం మండల అధ్యక్షుడిగా అంబటి మహేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా సంజీవరెడ్డి, కోశాధికారి మారం సమ్మిరెడ్డి, ఉపాధ్యక్షులు గోపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, జైపాల్‌రెడ్డి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

ఇసుక డంపుల సీజ్

తొర్రూరు రూరల్: మండలంలోని కంఠాయపాలెం గ్రామశివారు కస్నాతండాలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు ఎస్సై జగదీష్ ఆదివారం తెలిపారు. కొన్నిరోజులుగా తండాకు చెందిన కొంతమంది వ్యక్తులు ఆకేరువాగు నుంచి అక్రమంగా చుట్టు పక్కల గ్రామాలకు ఇసుక తరలిస్తూ వ్యాపారం చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేయగా, నిల్వ ఉంచి ఇసుక కుప్పలు కనిపించగా సీజ్ చేసినట్లు చెప్పారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండల కేంద్రంలో రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో రెడ్డికులానికి చెందిన 7గురు నిరుపేద విద్యార్థులకు రూ.35వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, కోశాధికారి సమ్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.